క్లుప్తంగా

పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్‌గా జీవీ బాధ్యతల స్వీకరణ



గన్నవరం: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా జీవీ రామచంద్రరావు గురువారం ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో ఆయన నర్సీపట్నం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ప్రస్తుతం రామచంద్రరావు రాష్ట్ర సాంకేతిక విద్యా మండలి కార్యదర్శిగా కూడా కొనసాగుతున్నారు. సాంకేతిక విద్యా శాఖలో ఆయన వివిధ హోదాల్లో పలు ప్రాంతాల్లో పనిచేశారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ.. కళాశాలలో కొత్తగా ఏర్పాటు చేసిన పాలిసెట్ కౌన్సెలింగ్ సెంటర్‌ను విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం




పెనమలూరు: గుండెకు అత్యవసర పరిస్థితిలో ఉపయోగపడే కార్డియోపల్మనరి రిససిటేషన్(సీపీఆర్)పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కాలేజీ ఎమర్జెన్సీ విభాగం ఇన్‌చార్జి డాక్టర్ టి.కృష్ణ చైతన్యకుమార్ అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో గురువారం ఫ్యాకల్టీకి సీపీఆర్‌పై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవిత రక్షణలో సీపీఆర్ చాలా ముఖ్యమన్నారు. గుండెనొప్పి వచ్చిన సమయంలో అత్యవసర పరిస్థితిలో సీపీఆర్ చేయటం వలన పేషెంట్ కోలుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. గుండె నొప్పి వచ్చే సమయంలో లక్షణాలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్లు లావణ్య, ఆనంద్, వైద్య బృందం పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారి



అంబాపురం(విజయవాడరూరల్): అంబాపురం(పైపులరోడ్డు) 13వ అడ్డరోడ్డులో స్థానికులు నిర్మించుకున్న రబ్బీస్ రోడ్డుపై డస్ట్, వైట్ మిక్స్ ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుపై వర్షం నీరు నిలిచి బురదలోనే స్థానికులు రాకపోకలు సాగిస్తున్నారు. గ్రామ పంచాయతీ పట్టించుకోకపోవడంతో స్థానికులే సొంత ఖర్చుతో రబ్బీస్‌ను తోలించుకున్నారు. ఆ రబ్బీస్‌పై డస్ట్, వైట్ మిక్స్ వేయిస్తానని గ్రామ సర్పంచ్ చెప్పి 10 రోజులు గడుస్తున్నా ఇంత వరకు రోడ్డుపై డస్ట్ వేయలేదు. రాళ్లు మొనతేలి నడవటానికి అవస్థలు పడుతున్నామని మహిళలు, వృద్ధులు అంటున్నారు. స్థానికుల ఇబ్బందిని దృష్టిలో పెట్టుకొని గ్రామ సర్పంచి స్పందించి రోడ్డు సరిచేయించాలని ప్రజలు కోరుతున్నారు.

25 నుంచి విద్యా జాగృతి ఉద్యమం



ఆటోనగర్(విజయవాడతూర్పు): విజయవాడ నార్త్ జమాఅతె ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి 30 వరకు విద్యా జాగృతి ఉద్యమం కార్యక్రమం నిర్వహిస్తామని జమాఅతె ఇస్లామి హింద్ అధ్యక్షుడు జహీరుద్దీన్ అన్నారు. విద్యా జాగృతి ఉద్యమం వాల్‌పోస్టర్లను ఆటోనగర్‌లోని కార్యాలయంలో గురువారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. బడి మానివేసిన విద్యార్థులను గుర్తించి మరలా ఆయా పాఠశాలల్లో చేర్పించేందుకు గాను ఈ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. వారికి ఆర్థిక సహాయం కూడా అందించనున్నామన్నారు. మస్జిద్ కమిటీలతో పాటు మేధావులతో ఈ కార్యక్రమంపై సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ముజాహిదీ హబీబ్‌ఖాన్, ఎండీ ఇర్ఫాన్, ఖలీద్, ఎండీ ఉమర్, ఇలియాస్ పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో చేరే విద్యార్థులకు రెండో విడత అడ్మిషన్ల కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రారంభించామని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కనకారావు ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు ఈనెల 20 నుంచి జులై 17వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోగా ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 8వ తరగతి ఉత్తీర్ణులైన వారు కూడా ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇతర వివరాలకు ఫోన్: 0866–2475575, 94906 39639 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

విద్యార్థినులకు భరోసా.. 'మార్పు' వసతి గృహం

- 100 మంది విద్యార్థినులకు వసతి
- 3 నుంచి 8వ తరగతి వరకు ఉచిత ప్రవేశం



పెనమలూరులో బాలికల వసతి గృహం

పెనమలూరు: పెనమలూరు గ్రామంలో పేద విద్యార్థినుల కోసం సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహం ఉచిత సేవలు అందిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో పేద విద్యార్థినుల అవసరాలను గుర్తించి బాలికల సంక్షేమ హాస్టల్‌లో 'మార్పు' పేరుతో అత్యాధునిక వసతులు కల్పించారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో బాలికల వసతి గృహం ఉన్నత సేవలు అందిస్తోంది. వివరాల్లోకి వెళితే సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పెనమలూరులో బాలికల వసతి గృహాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఈ వసతి గృహంలో ఎస్సీ, ఎస్టీ, ఓసీ, బీసీ విద్యార్థినులు ఉంటూ పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకోవటానికి అవకాశం కల్పించారు. అవసరమైతే విద్యార్థులకు ట్యూషన్ కూడా చెబుతారు. 3వ తరగతి నుంచి 8వ తరగతి వరకు విద్యార్థినులు ఈ వసతి గృహంలో ఉచితంగా ఉండవచ్చు. ఈ వసతి గృహంలో 100 సీట్లు ఉంటాయి. ఎస్సీ బాలికలకు 70 సీట్లు, మిగతా కులాల వారికి దామాషా పద్ధతిలో సీట్లు కేటాయిస్తారు.

మార్పుతో వసతి గృహానికి ఆదరణ

గత ప్రభుత్వ పాలనలో పేద విద్యార్థినుల కష్టాలు గుర్తించి మార్పు పథకంతో వసత గృహాన్ని ఆధునీకరించారు. జిల్లా మాజీ కలెక్టర్ జె.నివాస్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని దాదాపు రూ.30 లక్షలతో వసతి గృహంలో అన్ని వసతులు కల్పించారు. మోడరన్ టాయిలెట్స్, విశాలమైన లివింగ్ రూమ్, మోడరన్ డైనింగ్ హాల్ను ఏర్పాటు చేశారు. డైట్ కూడా ప్రతి ఆదివారం చికెన్ బిర్యాని, మంగళ, శుక్రవారాల్లో చికెన్ భోజనం, ప్రతి రోజూ కోడిగుడ్డు, వెజిటేరియన్ భోజనం అందిస్తారు. ఉదయం టిఫిన్‌లో వారంలో రెండు సార్లు ఇడ్లీ, ఆదివారం పూరీ, మిగతా రోజుల్లో పులిహోర, ఉప్మా, కిచిడి పెడతారు.

వసతి గృహంలో సౌకర్యాలు ఇవే

వసతి గృహంలో అడ్మిషన్ తీసుకున్న విద్యార్థినికి ట్రంకు పెట్టె, స్టీల్ గ్లాస్, రెండు దుప్పట్లు ఇస్తారు. ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, యూనిఫాం, ప్రతి నెల వైద్య పరీక్షలు చేస్తారు. 3–4 తరగతుల బాలికల అలంకరణకు రూ.110, 5 నుంచి 8వ తరగతి వరకు రూ.160 ఇస్తారు. ఆ నగదును విద్యార్థినుల బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తుంది.

దరఖాస్తు ఇలా..

బాలికల వసతి గృహంలో చేరే వారు దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. విద్యార్థిని టీసీ, ఆధార్, 3 ఫొటోలు, కుల ధ్రువీకరణ పత్రం, తల్లిదండ్రుల ఆధార్, రేషన్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్ మొదటి పేజీ జిరాక్స్‌లతో ఉచిత దరఖాస్తుతో ప్రవేశం పొందవచ్చు. అర్హులైన విద్యార్థినులకు అడ్మిషన్లు ఇస్తారు. విద్యార్థినులకు ప్రభుత్వ పథకాలు అమలు చేస్తారు. వసతి గృహంలో ఉన్న బాలికలకు అన్నీ ఉచితమే. ఈ నెలాఖరు వరకు అడ్మిషన్లు తీసుకుంటామని అధికారులు తెలిపారు.



డైనింగ్ హాల్‌లో భోజనం చేస్తున్న విద్యార్థినులు(ఫైల్)



వసతి గృహంలో చదువుతున్న విద్యార్థినులు(ఫైల్)



ఆధునిక టాయిలెట్స్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: వణుకూరు గ్రామంలో విద్యుత్ సరఫరాకు శుక్రవారం అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు అన్నారు. ఆయన గురువారం వివరాలు తెలుపుతూ పెనమలూరు సెక్షన్ వణుకూరు గ్రామంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు.

వీరపనేనిగూడెం పరిధిలో..

గన్నవరంరూరల్: మండలంలోని వీరపనేనిగూడెంలో విద్యుత్ సబ్ స్టేషన్ మెయింటెనెన్స్ నిమిత్తం శుక్రవారం ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ గుణదల ఈఈ పి.హరిబాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో వీరపనేనిగూడెం, తెంపల్లి, బల్లిపర్రు, మర్లపాలెం హౌసింగ్ కాలనీ, మెట్లపల్లి, కొత్తగూడెం, చింతగుంట, కంద్రిక, చిక్కవరం, ఉష స్పిన్నింగ్ మిల్, జై శ్రీ పాలిమర్స్, గొల్లనపల్లి, బీబీగూడెం గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. గ్రామస్తులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

దోమల నివారణకు చర్యలు

రామవరప్పాడు: గ్రామంలో దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎనికేపాడు పంచాయతీ సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు తెలిపారు. గ్రామంలో దోమలకు నిలయాలుగా మారిన పలు అంతర్గత రహదారుల్లోని డ్రెయిన్లను గురువారం పూడిక తీయించి బ్లీచింగ్ చల్లించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. పౌరుదలకు నోచుకోని డ్రెయిన్లను, చెత్త డంపింగ్ చేసే ప్రాంతాలను పరిశీలించి చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామంలోని ఖాళీ స్థలాలను గుర్తించి చెత్త డంప్ చేయకుండా, మురుగు నిల్వ లేకుండా మెరక తోలించుకోవాలని యజమానులకు సూచించామని తెలిపారు. గ్రామస్తులు కూడా తమ నివాస పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, చెత్త రోడ్లపై డంప్ చేయకూడదన్నారు. దోమల నివారణకు డ్రెయిన్లలో త్వరలో ఆయిల్ బాల్స్ వేయిస్తామని తెలిపారు.

గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ పనుల ప్రారంభం



హైవేపై నాటిన ఫాక్స్‌టైల్ మొక్కలు

గన్నవరం: నియోజకవర్గ కేంద్రమైన గన్నవరంలో విస్తరించి ఉన్న చెన్నై - కోల్‌కతా 16వ నంబర్ జాతీయ రహదారిపై గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ పనులు ప్రారంభించారు. గన్నవరం గ్రామ పంచాయతీ నిధులతో సుమారు 2.7 కిలోమీటర్ల పొడవునా ఈ పనులను చేపట్టారు. ఎన్‌హెచ్ గ్రీనరీ నిమిత్తం తూర్పుగోదావరి జిల్లా కడియం నర్సరీ నుండి ఒక్కొక్కటి సుమారు రూ.1,400 విలువైన 500కు పైగా ఫాక్స్‌టైల్ పామ్ మొక్కలను తీసుకువచ్చారు. ఈ మొక్కలను స్థానిక కొత్తపేట నుంచి శ్రీనివాస హేచరీస్ వరకు జాతీయ రహదారి సెంట్రల్ డివైడర్‌పై నాటుతున్నారు. అయితే ఎన్‌హెచ్ గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ పనులు గ్రామపంచాయతీకి పెనుభారంగా మారింది. గ్రామస్తుల నుంచి పన్నుల రూపంలో వసూలు చేసిన గ్రామపంచాయతీ నిధులను రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి వంటి సదుపాయలకు కాకుండా ఎన్‌హెచ్ గ్రీనరీకి ఉపయోగించడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సికిల్ సెల్ వ్యాధిపై అవగాహన ర్యాలీ



పెనమలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీవో ప్రణతి, ఎంవో సాయిలలిత

పెనమలూరు: సికిల్ సెల్ వ్యాధిపై అవగాహన పొందాలని మండల వైద్యాధికారి డాక్టర్ సాయిలలిత అన్నారు. వరల్డ్ సికిల్ సెల్ డిసీజ్ డే సందర్భంగా పెనమలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాయిలలిత మాట్లాడుతూ.. గిరిజన ప్రాంత ప్రజలకు ఈ వ్యాధి ఎక్కువగా కనబడుతుందన్నారు. రక్తంలో హిమోగ్లోబిన్ తగ్గుతుందని, గుండె ఆకృతి మారి రక్త ప్రసరణ రక్త నాళాలకు అందదన్నారు. నిమోనియా, కామెర్లు వంటి వ్యాధులకు గురవుతారని వివరించారు. ఇది జన్యుపరంగా వచ్చే వ్యాధన్నారు. రక్త పరీక్షలు ఎప్పటికప్పుడు చేసుకుంటే వ్యాధి బారిన పడకుండా వైద్యం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో బండి ప్రణవి, డాక్టర్ బిజిలీ శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవ ర్యాలీ



యోగా ర్యాలీలో పాల్గొన్న వీకేఆర్ విద్యార్థులు

కేసరపల్లి(గన్నవరం): ఈ నెల 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరుతూ గురువారం మండలంలోని కేసరపల్లి శివారు వీకేఆర్ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. తొలుత ఈ ర్యాలీని ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ నిత్యం యోగా చేయాలన్నారు. దీనివల్ల దీర్ఘకాలిక వ్యాధులకు, మానసిక ఒత్తిళ్లకు దూరంగా ప్రశాంతమైన జీవనం సాగించవచ్చని తెలిపారు. ఈ దిశగా ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు విద్యార్థులు తమవంతు కృషి చేయాలని సూచించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అధ్యాపకులు నవీన్, జాషువా, పి.రాంబాబు, ఆర్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సునిశిత హాస్యానికి చిరునామా జంధ్యాల



నివాళులర్పిస్తున్న గోపాలకృష్ణ, గుప్తా, ఎంసీదాస్, పీవీఎల్ నృసింహం తదితరులు

విజయవాడకల్చరల్: సునిశిత హాస్యానికి దర్శకుడు జంధ్యాల చిరునామా అని ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ అన్నారు. జంధ్యాల వర్ధంతి కార్యక్రమం కళామంజరి సాంస్కృతిక సేవా సంస్థ, సి రామ్మోహనరావు (ఆకాశవాణి) కల్చరల్ ఆర్గనైజేషన్, ఎస్వీ రంగారావు విగ్రహ ఆవిష్కరణ కమిటీ ఆధ్వర్యంలో తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలోని జంధ్యాల విగ్రహం వద్ద గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జంధ్యాల ఎందరో హాస్యనటులను వెండితెరకు పరిచయం చేశారన్నారు. చాలా సందర్భాల్లో రియాలిటీ షోలలో హాస్యం అపహాస్యం అవుతోందని ఆవేదన వ్యక్తంచేశారు.

బహుముఖ ప్రతిభాశాలి

జంధ్యాల సినీ రంగ సేవలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ జంధ్యాలకు నగరంతో విడదీయరాని సంబంధముందన్నారు. ఆయన బహుముఖ ప్రతిభాశాలి అని చెప్పారు. దర్శకుడిగా, మాటల రచయితగా, నటునిగా నాటక రచయితగా తన ప్రతిభను చాటుకున్నారని వివరించారు. జంధ్యాల కుటుంబ మిత్రులు, విద్యావేత్త డాక్టర్ ఎంసీ దాస్, పీవీఎల్ నృసింహం, మాడుగుల రామకృష్ణ, మార్కండేయ రాజు తదితరులు జంధ్యాలతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. వివిధ సంస్థలకు చెందిన ప్రతినిధులు హరగోపాల్, చింతకాయల చిట్టిబాబు, శ్యాంప్రసాద్, మల్లేశ్వర పట్నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పేదలకు అన్నదానం, వస్త్రదానం చేశారు.

బ్యాక్‌లాగ్ విద్యార్థులకు ప్రత్యేక అవకాశం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అటానమస్ 2017, 2018 పీజీ 2020 బ్యాచ్‌లో సబ్జెక్టులు మిగిలిపోయిన విద్యార్థులకు ప్రత్యేకంగా ఒక అవకాశం కల్పిస్తూ పరీక్షలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షల నిర్వహణకు కృష్ణా విశ్వవిద్యాలయం నుంచి అనుమతి తీసుకున్నామన్నారు. పరీక్షలు రాయదలిచిన వారు జులై 18లోగా పరీక్ష ఫీజు చెల్లించాలని చెప్పారు. జులై 25 నుంచి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. వివరాలకు కళాశాలలో సంప్రదించాలని కోరారు.

హుండీ ఆదాయం రూ. 9.08 లక్షలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయ స్వామి వారి ఆలయంలో భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను లెక్కించగా రూ. 9 లక్షల 8 వేల 929 ఆదాయం లభించింది. స్థానిక మాచవరం దాసాంజనేయ స్వామి వారి ఆలయంలో గురువారం దేవదాయ ధర్మాదాయ శాఖ తనిఖీ అధికారి పర్యవేక్షణలో సేవా సంఘం సభ్యులు, భక్తుల సమక్షంలో హుండీ కానుకలను లెక్కించారు. 3 నెలల 6 రోజులకు గానూ రూ. 9 లక్షల 8 వేల 929 నగదు, 21 అమెరికన్ డాలర్లు లభించాయని ఆలయ కార్యనిర్వహణాధికారి పాతూరి లోకేశ్వరి తెలిపారు.

రైతులకు మెరుగైన సేవలందించేందుకు కృషి



మాట్లాడుతున్న ఏవో ఉషారాణి

కంకిపాడు: రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని మండల వ్యవసాయాధికారి వెలివెల ఉషారాణి బాబూరావు అన్నారు. మార్కెట్‌యార్డులోని అగ్రి ల్యాబ్‌లో గురువారం ఆమె మండల వ్యవసాయాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఇక్కడ పనిచేసిన పీఎం కిరణ్ కృత్తివెన్నుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో తూర్పుగోదావరి జిల్లా అడ్డతీగలలో పనిచేస్తున్న ఉషారాణి నియమితులయ్యారు. సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించిన అనంతరం ఏవో మాట్లాడుతూ ఈ ప్రాంతంపై పూర్తి స్థాయి అవగాహన ఉందన్నారు. రైతులకు సీజన్‌కు అనుగుణంగా విత్తనాలు సమకూరుస్తామన్నారు. సాగులో ఎలాంటి ఒడిదుడుకులు తలెత్తకుండా మెరుగైన సమాచారాన్ని అందిస్తూ సమన్వయంతో వ్యవహరిస్తామని చెప్పారు. కంకిపాడు యార్డులో ఉన్న అగ్రిల్యాబ్ ద్వారా అందే సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాపులపాడు వ్యవసాయ, ఉద్యాన అధికారులుగా రంగనాథ్, జోసఫ్

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండల వ్యవసాయ, ఉద్యాన అధికారులుగా రంగనాథ్ బాబు, సీహెచ్ జోసఫ్ సుందరం గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ వ్యవసాయ అధికారిగా పనిచేస్తున్న జొన్నలగడ్డ భవాని ఆగిరిపల్లికి బదిలీ కాగా, ఆమె స్థానంలో విజయవాడ రూరల్ మండలం నుంచి రంగనాథ్‌బాబు బాపులపాడు ఏవోగా వచ్చారు. ప్రస్తుతం ఇక్కడ ఉద్యాన అధికారిగా పని చేస్తున్న ఇ.హరిచంద్ కంకిపాడు బదిలీ కాగా, ఆయన స్థానంలో అక్కడ పని చేస్తున్న జోసఫ్ సుందరం బాపులపాడుకు వచ్చారు. ఈ ఇరువురు అధికారులు బాధ్యతలు స్వీకరించిన అనంతరం స్థానిక మహాత్మాగాంధీ నగర్‌లోని మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న అధికారులు కలిసి వీఏఏ, వీహెచ్ఏలతో ఉమ్మడి సమావేశం నిర్వహించారు. రానున్న ఖరీఫ్ సీజన్‌లో పాటించాల్సిన సలహాలు, సూచనలను రైతులకు అందించాలని సూచించారు.

27 మందికి జరిమానా

విజయవాడలీగల్: నగరంలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 27 మందికి న్యాయస్థానం జరిమానా విధించింది. విజయవాడ నగర పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు ఆదేశాల మేరకు నగరంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 27 మందిపై 2వ, 4వ ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేశారు. 27 మందిని కోర్టులో హాజరుపరచగా ఆరవ అదనపు జ్యుడీషియల్ ఫస్టు క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి లెనిన్‌బాబు ఆరుగురికి ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున, మిగిలిన 21మందికి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

గాయకులు నిరంతర సాధన చేయాలి



విజయవాడ కల్చరల్: గాయనీ, గాయకులు స్వయంకృషితో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు అన్నారు. తెలుగు కళావాహిని, శ్రీకళా భారతి, కామ్రేడ్ జీఆర్‌కే, పోలవరపు సాహితీ సమితి, పద్మ మెలోడీస్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళా వేదికపై గురువారం సినీ సంగీత విభావరి, గాయనీ గాయకులకు ఆత్మీయ సత్కారం కార్యక్రమం నిర్వహించారు. చిట్టిబాబు మాట్లాడుతూ గాయనీ, గాయకులు నిరంతరం సాధన చేయాలన్నారు. సంస్కార భారతి సాహిత్య విభాగం నిర్వాహకుడు బోడి ఆంజనేయరాజు మాట్లాడుతూ సాంస్కృతిక కళా సంస్థలు కళాకారుల సంక్షేమానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కె.డేవిడ్‌రాజు, బీవీ వీరభద్రరావు, పరుచూరి విజయలక్ష్మి, శింగంశెట్టి చంద్రశేఖర్, టీఎస్ రెడ్డి పాల్గొన్నారు. గాయనీ, గాయకులు పలు చిత్ర గీతాలను ఆలపించారు. గాయని పద్మ వంద పాటలను సోలో గీతాలను ఆలపించారు. నిర్వాహకులు పద్మను ఆత్మీయంగా సత్కరించారు.

శ్రీనగర్‌కాలనీలో ప్రమాదకరంగా కల్వర్టు



దెబ్బతిన్న కల్వర్టు వద్ద ఉంచిన చెట్ల కొమ్మలు

గన్నవరం: స్థానిక శ్రీనగర్ కాలనీలోని ప్రధాన రహదారిపై మూడు రోడ్ల కూడలిలో ఉన్న కల్వర్టు ప్రమాదకరంగా మారింది. భారీ వాహనాల దాటికి డ్రెయినేజీ కల్వర్ట్‌పై వేసిన సిమెంట్ దిమ్మలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో రహదారి మధ్యలో భారీగా గుంత పడడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ముఖ్యంగా రాత్రి వేళలో ఆ గుంతలో పడి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కల్వర్టు దెబ్బతిని నెలలు గడుస్తున్నప్పటికీ గ్రామ పంచాయతీ అధికారులు కనీస మరమ్మతులు చేపట్టలేదు. దీంతో ప్రమాదాలను నివారించేందుకు స్థానికులే ముందుకువచ్చారు. కల్వర్టుపై ఉన్న గుంతను వాహనదారులు ముందుగానే గుర్తించే విధంగా చెట్ల కొమ్మలను అక్కడ ఏర్పాటు చేశారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి దెబ్బతిన్న కల్వర్టుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఐక్యతతోనే ప్రపంచ శాంతి సాధ్యం



దివ్యబలిపూజ సమర్పిస్తున్న బిషప్ జోసఫ్ రాజారావు

మానికొండ(గన్నవరం): ఐక్యతతోనే ప్రపంచ శాంతి సాధ్యమవుతుందని విజయవాడ మేత్రాసనం పీఠాధిపతులు తెలగతోటి జోసఫ్ రాజారావు తెలిపారు. ఉంగుటూరు మండలం మానికొండలో గురువారం జరిగిన రెవ.ఫాదర్ చింతగుంట ఇన్నయ్య, జోజయ్యల ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిషప్ నేతృత్వంలో దివ్యబలిపూజ సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఫాదర్ ఇన్నయ్య తన జీవితం అంతా క్రీస్తు సేవకే అంకితం చేశారని చెప్పారు. ఆయన బాటలోనే సోదరుడు జోజయ్య, ఇతర కుటుంబ సభ్యులు సేవా భావాన్ని చాటటం అభినందనీయమన్నారు. అనంతరం జోజయ్య కుమారుడు ఫాదర్ సురేష్‌బాబు నేతృత్వంలో 200 మంది విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. తొలుత జోజయ్య విగ్రహాన్ని న్యాయవాది వినోద్ పెర్నండ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఫాదర్లు బెల్జియం, సతీష్‌బాబు, కిశోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి



ప్రజలకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

పొట్టిపాడు(గన్నవరం): ఉంగుటూరు మండలం పొట్టిపాడు గ్రామ శివారు ఆనందపురంలో గురువారం టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా క్షయవ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. తొలుత ఈ ర్యాలీని పెద్దఆవుటపల్లి పీహెచ్‌సీ డాక్టర్ కరిముల్లా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో క్షయ వ్యాధి మరణాలు రేటును తగ్గించేందుకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఈ ప్రచార కార్యక్రమం చేపట్టిందన్నారు. క్షయవ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఈ వ్యాధి లక్షణాలు కనిపిస్తే సమీపంలో టీబీ సెంటర్లను సంప్రదించాలన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ అంకూరి నాగమల్లేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీ అండ్ సీహెచ్‌ఓ ఎస్.రామారావు, పలువురు ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పెట్రోలు బంకులో సొమ్ము దోపిడీ కేసులో జైలు శిక్ష

కంకిపాడు: పెట్రోలు బంకులో సొమ్ము దోపిడీ కేసుల్లో ఇద్దరు నిందితులకు ఆర్నెల్లు జైలు శిక్ష విధిస్తూ మచిలీపట్నం ఐదో మెట్రోపాలిటిన్ మేజిస్ట్రేట్ కోర్టు గురువారం తీర్పునిచ్చింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని మద్దూరు గ్రామ పరిధిలోని కరకట్టపై ఉన్న పెట్రోలు బంకులో మార్చి 10, 2023న ముగ్గురు వ్యక్తులు బైక్‌పై వచ్చి పెట్రోలు బంకులో పని చేస్తున్న సిబ్బందిని బెదిరించి రూ.30 వేలు నగదు దోపిడీకి పాల్పడ్డారు. ఈ ఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. కేసు విచారణలో భాగంగా నిందితులు సింగిరి చంద్రశేఖర్(ఏ1), చీకుర్తి నాని(ఏ2), రగాల మధుకిశోర్(ఏ3)లను అరెస్టు చేసి, నగదును స్వాధీనం చేసుకున్నారు. చీకుర్తి నాని, మధుకిశోర్‌లకు కేసుతో సంబంధం ఉన్నట్లు తేల్చింది. నేరం రుజువు కావటంతో ఆర్నేల్లు జైలుశిక్ష విధిస్తూ మేజిస్ట్రేట్ తీర్పునిచ్చారని ఎస్ఐ సందీప్ తెలిపారు.